క్లుప్తంగా

ట్రైకార్ చైర్మన్‌కు మాతృవియోగం



సేవి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య

త్రిపురారం: రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ(ట్రైకార్) చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ తల్లి ఇస్లావత్ సేవి అనారోగ్యంతో బుధవారం మండలంలోని సత్యంపహాడ్ తండాలో మృతిచెందింది. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, టీఎస్ఎపెడీసీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు సత్యంపహాడ్ తండాకు చేరుకుని సేవి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో తిరుమలగిరి ఎంపీపీ భగవాన్ నాయక్, జెడ్పీటీసీ ధనావత్ భారతి, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, త్రిపురారం సర్పంచ్ అనుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ కార్మికుల దీక్ష

మిర్యాలగూడ: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం గ్రామంలో గల మిషన్ భగీరథ ప్లాంట్ ఎదుట కార్మికులు చేస్తున్న రిలే దీక్ష బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని ఐదు రోజుల నుంచి దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని పరిరక్షించాలి

హాలియా: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం మండల తహసీల్దార్ మంగకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో కాకతీయ కాలం నాటి పురాతన విగ్రహం బయటపడిందన్నారు. ఈ విగ్రహాన్ని ఆర్కియాలజీ అధికారులకు అందజేయాలని లేని పక్షంలో వేరే ప్రాంతంలో ప్రతిష్ఠించాలి తప్ప కళాశాలకు చెందిన స్థలంలో దేవాలయం కట్టే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి జగదీష్, కోరే రమేష్, కళాశాల కమిటీ విద్యార్థులు చందు, నవీన్, శ్రీకాంత్, సాయి తదితరులు ఉన్నారు.

'తపస్' డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



తపస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దవూర: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాస్, జార్జ్, సుదర్శన్, హిమవంత రెడ్డి మాట్లాడుతూ.. డైరీలో ఉపాధ్యాయులకు కావాల్సిన జీఓలు అన్నీ అందరికీ అర్థమయ్యేలా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా మాజీ అధ్యక్షుడు గుర్రం ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అలుగుబెల్లి కరుణాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రేపాల అశోక్, జిల్లా నాయకులు గగ్గినపల్లి రామ్మోహన్, వాసు, లోకేష్, ఉపాధ్యాయులు విజయారెడ్డి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బడి సమయంలో బయటకు వెళ్లి..



కరివేపాకు తీసుకెళ్తున్న పెద్దదేవులపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బడి సమయంలో బయటకు వెళ్లి మధ్యాహ్న భోజనానికి కావాల్సిన కరివేపాకు తీసుకొచ్చారు. దీనికి సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు చదువుకోకుండా పనులు చేస్తున్నారని, జిల్లా అధికారులు గమనించి ఇలాంటి తప్పిదాలు మళ్లీ జరగకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉపాధిలో అవకతవకలకు చెక్

- జాబ్‌కార్డులకు ఆధార్ లింక్ తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- తిరుమలగిరి మండలంలో మొత్తం 32895 మంది కూలీలు
- ఇప్పటి వరకు 7363 మంది ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి
- ఈ నెలాఖరు వరకు గడువు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు తీసుకొచ్చింది. గతంలో ఉపాధి కూలీల వివరాలు మస్టర్‌లో(పేపర్లో) నమోదు చేసుకునేవారు. దీంతో అవకతవకలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందనే ఉద్దేశంతో ఇక నుంచి ప్రతి కూలీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల మొదటి వారంలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కూలీ చెల్లింపుల్లోనూ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కూలీల జాబ్‌కార్డులకు ఆధార్‌కార్డును కచ్చితంగా అనుసంధానం చేయాలని పేర్కొంది.

ఆధార్‌తో అనుసంధానం

ఉపాధి పనులు చేసేందుకు పేర్లు నమోదు చేసుకున్న కూలీలు తమ ఆధార్‌కార్డులను జాబ్‌కార్డులతో అనుసంధానం చేసుకోవాలి. మండలంలో 32895 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరంతా ఈ నెల చివరి వరకు ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. గ్రామంలోని ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శికి ఆధార్‌కార్డు జిరాక్స్‌ను అందించినట్లయితే వారు ఆధార్‌కార్డును జాబ్‌కార్డుతో అనుసంధానం చేయనున్నారు. కానీ ఈజీఎస్ అధికారుల సాఫ్ట్‌వేర్ రోజుకు 100 నుంచి 150మంది కూలీల ఆధార్‌కార్డులు మాత్రమే తీసుకుంటుండటంతో మందకొడిగా సాగుతోంది. మండలంలో 32895 మంది కూలీలు ఉంటే ఇప్పటి వరకు 7363మంది మాత్రమే తమ ఆధార్‌కార్డులను అనుసంధానం చేసుకున్నారు. ప్రభుత్వం ఈ నెల చివరి వరకు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించినా గడువు ముగిసే లోపు అందరూ ఆధార్ కార్డులు అనుసంధానం చేసుకునేలా కనిపించడం లేదు. ఈ ప్రక్రియ పూర్తయితే ఉపాధి కూలీకి ఏ బ్యాంకులో ఖాతా ఉన్నా కూలీ డబ్బులు వెంటనే జమవుతాయి. గతంలో కూలీలు ఇచ్చిన బ్యాంకు ఖాతాకు ఏదైనా సమస్య తలెత్తితే కూలీ డబ్బులు నిలిచిపోయేవి. ప్రస్తుతం ఆధార్ అనుసంధానం చేయడం ద్వారా దానికి లింకై న మరో బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవనున్నాయి.

ఆన్‌లైన్‌లోనే ఉపాధి హాజరు..

అంతేకాకుండా కూలీల హాజరు గతంలో మేట్ల ద్వారా జరగ్గా, గతేడాది మే నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైంది. ఇప్పటి వరకు ఎలాగో అలా నమోదు జరిగినా ఇక నుంచి మాత్రం పూర్తిగా ఆన్‌లైన్‌లోనే కూలీల హాజరు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కూలీలు పనిచేసే ఫొటోలు సైతం ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ విధానంతో ఎలాంటి అవకతవకలకు అస్కారం లేకుండా ఉంటుందనేది ప్రభుత్వం ఆలోచన.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి



ఉపాధి పనుల్లో అవకతవకలను అరికట్టేందుకు గాను కూలీలు తమ జాబ్ కార్డులను ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలి. కూలీలు తమ గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆధార్‌కార్డు జిరాక్స్‌లు ఇస్తే వారు జాబ్‌కార్డులకు వాటిని అనుసంధానం చేస్తారు. దీంతో ఎలాంటి జాప్యం లేకుండా నేరుగా కూలీల ఖాతాల్లోనే డబ్బులు జమఅవుతుంది.

– నాగేశ్వరావు, ఏపీఓ, తిరుమలగిరి

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



దేవరకొండ: క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీటీ, జెడ్పీటీసీ అరుణాసురేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, శిరందాసు కృష్ణయ్య, తాళ్ల సురేష్, ఉమామహేశ్వర్, నీలా రవి, రాపోలు నిరంజన్, శ్రీను, రమేష్, చంద్రయ్య, అసోసియేషన్ సభ్యులు తదితరులున్నారు.

పెద్దగట్టు లిఫ్టుతో గ్రామాలు సస్యశ్యామలం

పెద్దఅడిశర్లపల్లి: పెద్దగట్టు లిఫ్టుతో పెద్దగట్టు, నంభాపురం గ్రామాలు సస్యశ్యామలం అవుతాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం మన ఊరు–మన ప్రభుత్వం–మన పథకాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దగట్టు, నంభాపురం గ్రామాలల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దగట్టు లిఫ్టుకు రూ.82.72 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, సర్పంచ్‌లు నరందర్‌నాయక్, అంజిరెడ్డి, శీలం శేఖర్‌రెడ్డి, కడారి శ్రీనివాస్, ఎంపీటీసీ నారాయణ, తోటకూరి పరమేష్, అర్వపల్లి నర్సింహ, ఎర్ర యాదగిరి, కర్ణయ్య, సీతారాం తదితరులున్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



మిర్యాలగూడ: కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఎల్ఆర్

మిర్యాలగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మిర్యాలగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్ఆర్) అన్నారు. బుధవారం పట్టణంలోని 43వ వార్డు కౌన్సిలర్ జాని ఆధ్వర్యంలో సీపీఎం, సీఐటీయూకు చెందిన 60కుటుంబాలు బీఎల్ఆర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవుల కోసం సీపీఎం పార్టీ బీఆర్ఎస్‌తో కలవడంతో బడుగు, బలహీన, కార్మిక వర్గాలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. కార్యక్రమంలో నూకల వేణుగోపాల్ రెడ్డి, చిలుకూరి బాలు, బెజ్జం సాయి, అజహర్, గౌస్, శివ, రవి తదితరులు ఉన్నారు.

వారితో సంబంధం లేదు..

మిర్యాలగూడ అర్బన్: సీపీఎం, సీఐటీయూకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని, కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు వ్యక్తులకు సీపీఎం పార్టీ, సీఐటీయూకి ఎలాంటి సంబంధం లేదని పార్టీ పట్టణ టూటౌన్ కార్యదర్శి బావండ్ల పాండు, సీఐటీయూ పట్టణ కన్వీనర్ తిరుపతి రామ్మూర్తి బుధవారం సంయుక్త ప్రకటలో పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరిని మూడు నెలల క్రితమే పార్టీ నుంచి బహిష్కరించామని తెలిపారు. అంతేకాకుండా 60 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారని అసత్యపు ప్రచారం చేయడం తగదని, వారందరు తమ పార్టీతోనే ఉన్నారని అన్నారు.

తడకమళ్లలో డీఎల్‌పీఓ విచారణ

- 33గుంటల గ్రామపంచాయతీ భూమి కాజేసేందుకు యత్నం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామ వార్డు సభ్యురాలు
- పలు రికార్డుల సీజ్



గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ ప్రతాప్‌నాయక్

మిర్యాలగూడ అర్బన్: మండలంలోని తడకమళ్ల గ్రామపంచాయతీ సర్పంచ్, గ్రామ కార్యదర్శి అవినీతికి పాల్పడటంపై వార్డు సభ్యురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో బుధవారం డీఎల్‌పీఓ ప్రతాప్‌నాయక్ విచారణ చేపట్టారు. వివరాలు.. గ్రామ సర్పంచ్ చేస్తున్న పంచాయతీ నిధులు దుర్వినియోగంపై, స్థలాల ఆక్రమణపై గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు వై. సుజాత, వై. అంజనేయులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టి పూర్తి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ డీఎల్‌పీఓ ప్రతాప్‌నాయక్‌ను ఆదేశించగా, ఆయన బుధవారం గ్రామానికి చేరుకుని గ్రామపంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం పలు రికార్డులను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. పూర్తి విచారణ అనంతరం జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని పేర్కొన్నారు.

33గుంటల భూమి కబ్జాకు యత్నం..?

కాగా గ్రామం చివరన ఉన్న 33గుంటల భూమిని కార్యదర్శితో కలిసి సర్పంచ్ కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని, అంతేకాకుండా గ్రామంలోని బస్టాండ్ స్థలాలను సైతం ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొనగా డీఎల్‌పీఓ విచారణలో స్థలాల ఆక్రమణకు పాల్పడుతున్నారని గుర్తించినట్లు సమాచారం. పూర్తి నివేదిక అనంతరం జిల్లా అధికారుల చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

భారత బంజారా కుంభమేళా పోస్టర్ ఆవిష్కరణ



పెద్దవూరలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే భగత్

పెద్దవూర: మహారాష్ట్రలోని గోద్రా జిల్లాలో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న భారత బంజారా కుంభమేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ కోటిరెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బుడియా బాపు పీఠాధిపతి ఆంగోతు భగవాన్‌నాయక్, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్ రెడ్డి, పెద్దవూర సర్పంచ్ నడ్డి లింగయ్య, బీఆర్ఎస్ నాయకులు వాసుదేవుల సత్యనారాయణరెడ్డి, జటావత్ రవినాయక్, ఏబీఎస్ఎస్ జిల్లా నాయకుడు రమావత్ రవినాయక్, ధర్మజాగరణ సమితి జిల్లా అధ్యక్షుడు నరియానాయక్, దేవసాని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషిచేయాలి

మిర్యాలగూడ: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని వేములపల్లి ఎంపీపీ పుట్టల సునీత అన్నారు. బుధవారం వేములపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల నివేదికలను ప్రవేశపెట్టగా వాటిపై చర్చించారు. మండలంలో చేపట్టే ప్రతి కార్యక్రమానికి అధికారులు ప్రొటోకాల్ నిబంధనలను పాటించాలని, ప్రభుత్వ పథకాల్లో అర్హులైన లబ్ధిదారులను ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనవకుండా పారదర్శకంగా ఎంపిక చేయాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోవర్ధని, తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీఓ అజ్మీరాదేవిక, ఏఈలు ఆదినారాయణ, చిన్నినాయక్, శ్రీధర్‌రెడ్డి, ఏఓ రుషేంద్రమణి, ఎంఈఓ బాలాజీనాయక్, పశువైద్యాధికారి సందీప్, అనూక్, మిరాజొద్దీన్, సునీత, సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, లక్ష్మీ, పద్మ, రాజు, నాగలక్ష్మీ, సైదులు, ఎంపీటీసీలు నంద్యాల శ్రీరాంరెడ్డి, చల్లబొట్ల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పేద ఆర్యవైశ్య మహిళలకు పింఛన్లు



పేద ఆర్యవైశ్య మహిళలకు పింఛన్లు అందజేస్తున్న వాసవి, వనిత క్లబ్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెల 10వ తేదీన పేద ఆర్యవైశ్య మహిళలకు ×ఆర్యవైశ్య మహిళ పెన్షన్ పథకం¯ పేరుతో పింఛన్లు అందిస్తామని క్లబ్ రీజినల్ చైర్మన్ రాయపూడి భవాని అన్నారు. బుధవారం పట్టణంలోని వాసవి భవన్‌లో దాతల సహకారంతో ఆర్యవైశ్య పేద మహిళలకు పింఛన్లు అందించారు. ఈ పథకం ద్వారా జనవరి నుంచి డిసెంబర్ వరకు ప్రతి నెల 30 మందికి పింఛన్లు అందిస్తామన్నారు. ఆర్యవైశ్య పేదలు ఉంటే డిస్ట్రిక్ట్ వి(104ఎ) వారికి సమాచారం అందించాలన్నారు. ప్రతి నెల 30మందికి పింఛన్లు అందించేందుకు జ్యోతీరమేష్, మారం పద్మ, కొండూరు ఇందిర, వనజాశేఖర్, రోజారాణి, సరోజాశ్రీనివాస్, శారద ముందుకు వచ్చారన్నారు.

నేడు ముగ్గుల పోటీలు..

పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం వాసవి క్లబ్, వనిత కుసుమాంబ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ రీజినల్ చైర్మన్ రాయపూడి భవాని తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన విజేతలకు ప్రియా గోల్డ్ ఆయిల్ వారు బహుమతులు అందిస్తారని పేర్కొన్నారు.

అంధత్వ నివారణకే 'కంటి వెలుగు'



హాలియా: సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుమతి



మిర్యాలగూడ: సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సరళ

హాలియా: అంధత్వ నివారణకే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తోందని అనుముల మండల ఎంపీపీ పేర్ల సుమతీపురుషోత్తం అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 18న ప్రారంభకానున్న కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీ, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం కళావతి, ఏపీఓ శ్యామలా, మెడికల్ ఆఫీసర్ బోసు, డాక్టర్ ఆర్ బిర్ల, సుదర్శన్, కంటి వెలుగు అధికారులు వరప్రసాద్, డి. మోతీలాల్, వెంకటేశ్వర్లు, మట్టారెడ్డి, గీత, సరోజా, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి

నాగార్జునసాగర్: కంటి వెలుగు కార్యక్రమంపై నందికొండ మున్సిపాలిటీ కార్యాలయంలో అన్ని వార్డుల ఆఫీసర్లు, మెప్మా రీసోర్స్‌పర్సన్లు, కౌన్సిలర్లతో మున్సిపల్ చైర్‌పర్సన్ కర్ణ అనూషాశరత్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్‌రెడ్డి మున్సిపాలిటీ మాట్లాడుతూ.. 18సంవత్సరాలు నిండి కంటి సమస్యలు ఉన్న ప్రతిఒక్కరిని కంటి వెలుగు క్యాంపులకు తీసుకురావాల్సిన బాధ్యత వార్డు ఆఫీసర్లు, రీసోర్స్‌పర్సన్లు, కౌన్సిలర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బిన్ని, కౌన్సిలర్లు రామకృష్ణ, రమేశ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ: కంటి వెలుగు కార్యక్రమంపై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఆగ్రోస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డితో కలిసి ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి పాల్గొని మాట్లాడారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై గ్రామస్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఎంపీఓ మోహిన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల కేంద్రంలోని శ్రీశ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో సర్పంచులు, ఆరోగ్యశాఖ అధికారులు, ఎంపీటీసీలు, కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన రెండో విడత కంటి వెలుగు సమీక్ష సమావేశంలో ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా అస్గర్ అలీ, ఎంపీఓ పద్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

డిండి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్. కరుణాకర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి, ఉపాధ్యాయులు అంజయ్య, నాగరాజు, జిలానీ, జయంతి, విజయ, సునీత, జ్యోతి, పల్లవి, సత్యనారాయణ, ఆంజనేయులు, రవి, సోమయ్య, యాదగిరి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రి జీవితం స్ఫూర్తిదాయకం



లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హాలియా: భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలు మరువలేనివని, ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయమని మాజీ ఎంపీపీ చవ్వా బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అనుముల మండల మాజీ ఉపాధ్యక్షుడు శాగం పెద్దిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు దాసా వెంకన్న, ఉపాధ్యాయులు మందా సైదులురావు గౌతమ్, యడవెల్లి రాంబాబు, ఈగల లింగయ్య, చనగళ్ల యల్లయ్య, బుయ్య పరమేష్, రిజ్వానా, బైరు సైదులు, కోటేష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

మిర్యాలగూడ: రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో ఈ నెల 13, 14 తేదీల్లో జరగనున్న టీఎస్ యూటీఎఫ్ 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం వేములపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాశిమల్ల నాగయ్య, మాలోతు నగేష్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం వేములపల్లి మండల కేంద్రంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి చేతులమీదుగా మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, స్వర్ణ, యాదమ్మ, సైదిరెడ్డి, ఉపేందర్, సుధాకర్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు: టీఎస్ యూటీఎఫ్ ఐదో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలలో బుధవారం సంఘం మండల అధ్యక్షుడు బి. నాగయ్య సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ మహాసభలకు కేరళ ఆరోగ్య శాఖ మంత్రి కేకే శైలజ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బి. సైదులు, జిల్లా కార్యదర్శి అరుణ, సీనియర్ ఉపాధ్యాయులు పాండరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు రక్తదాన శిబిరం

నాగార్జునసాగర్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని గురువారం ఉదయం 10గంటలకు నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిలో విజయపురిటౌన్ ఎస్ఐ రాంబాబు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సాగర్ సీఐ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

మిర్యాలగూడ: వేములపల్లి మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన బారి వెంకన్న(43) బుధవారం మృతిచెందాడు. స్థానిక సర్పంచ్ నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి వెంకన్న మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు.

చలో డిల్లీ కరపత్రం ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్: దేశ వ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో డిల్లీ కరపత్రాన్ని బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద వివిధ పార్టీలకు చెందిన బీసీ నాయకులు ఆవిష్కరించారు. బీసీ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పాగుల సైదులుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అన్నభీమోజు నాగార్జునాచారి, చిరుమర్రి కృష్ణయ్య, డబ్బికార్ మల్లేష్, బంటు సైదులు తదితరులున్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ

కొండమల్లేపల్లి: మండల పరిధిలోని పలు రేషన్ దుకాణాలను బుధవారం జిల్లా పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి నెలకు సంబంధించి రేషన్ పంపిణీ బుధవారం ప్రారంభమైనట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని మున్నూరు కాపు సంఘం కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవుల వెంకటనర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నేతి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మేకల శ్రీనివాస్‌రావు, నియోజకవర్గ కన్వీనర్ పందిరి వేణు, గౌరవ అధ్యక్షుడు పుప్పాల సత్యం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంచి సత్యనారాయణ, కొండేటి శేఖర్ తదితరులున్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

దేవరకొండ: పట్టణంలో బుధవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఏబీవీపీ దేవరకొండ నగర శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారి గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నల్లగొండ విభాగ్ సంఘటన కార్యదర్శి బోడ లక్ష్మణ్, కొత్త అఖిల్, ఏబీవీపీ నగర కార్యదర్శి గోపిచంద్, గణేశ్, ప్రభు, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేయాలి

దేవరకొండ: బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేయాలని నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం కన్వీనర్ వైద్యుల కృష్ణమూర్తిశర్మ అన్నారు. బుధవారం పట్టణంలోని కోదండరామాలయంలో జరిగిన నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం సమావేశంలో సంఘం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా గార్లపాటి భాస్కర శర్మ, గంటసాల శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా సత్యనారాయణశర్మ, మీడియా కన్వీనర్‌గా గాదె గిరిధర్‌రావు, ప్రచార కార్యదర్శులుగా ఉప్పల శ్రీకాంత్, కిషోర్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు సన్మానం

త్రిపురారం: నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన మెరుగు రామలింగయ్యను సత్యనారాయణపురం గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామర్ల జానయ్య, బీఆర్ఎస్ నిడమనూరు మండల అధ్యక్షుడు తాటి సత్యపాల్, ఎంపీటీసీ చిత్రం జీవన్‌రావు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

చందంపేట: నేరెడుగొమ్ము మండల ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి సావిత్రిబాయి పూలే అవార్డు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం గౌడ సంఘం జిల్లా నాయకులు, రైతు సమన్వయ సమితి చందంపేట మండల అధ్యక్షుడు బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు పాషా, రాములుగౌడ్, వెంకటయ్య, కేశవులు, నరేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడికి ఆర్థికసాయం అందజేత

త్రిపురారం: మండలంలోని కంపాసాగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో బోరు వేసేందుకు గాను అదే గ్రామానికి చెందిన కొండ భాస్కర్ బుధవారం రూ.20వేల ఆర్థికసాయాన్ని ప్రధానోపాధ్యాయురాలు పద్మకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బాబు, పడిశనబోయిన యాదగిరి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

దేవరకొండ: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గిరిజన మహిళా గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం అందజేసిన బెడ్‌షీట్‌లు, స్కూల్ బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమాసుజాత, నేతాళ్ల యాదయ్య, ఏపీఓ రామచంద్రం, టీచర్లు పాల్గొన్నారు.